

కథా కౌముది

# మతి మెరుపు - డా. డి.వి.జి శంకరరావు

**ఉదయాన్నే** పేపర్లో వాడి ఫోటో చూడగానే గుండెలో రాయిపడింది. పిల్లల దగ్గరకని అమెరికా వెళ్ళొచ్చి వారమే అయింది. నేను తిరిగి వచ్చేసినట్టు వాడికి తెలిసి ఉండదు కూడా. వైజాగ్‌లో ఉన్నన్నాళ్ళూ ఏదో హుద్ హుద్‌లూ, అవాంతరాలు ఆస్థాయివి వస్తే తప్ప మేం కలవని రోజుండదు. ఇద్దరికీ వేరే పనేం ఉంది గనక. విశ్రాంత జీవితాలు మావి. ఇంజనీర్‌గా నేను, డాక్టర్‌గా వాడు రిటైరయ్యి దశాబ్దమైంది.

ఫోటో క్రింద వార్త చూడగానే కాస్త నిమ్మళించాను. ‘థాంక్‌గాడ్‘ అనుకుంటూ. నా చాదస్తానికి మీకు నవ్వు రావొచ్చుగానీ ఒక వయసు దాటాక పేపర్లో ఫోటో అంటే కీడు శంకించదూ! అయితే ఆ వార్త మాత్రం తక్కువ స్థాయి షాకేం ఇవ్వలేదు. అది ఇలా ఉంది.

”ప్రముఖ వైద్యులు మూర్తిగారికి మతిమరుపు వ్యాధి సోకింది. ఆయన ఇంట్లోనుంచి వెళ్ళిపోయి, కన్ఫ్యూజన్‌తో తిరుగాడుతుండగా ఆయన్ని తెలిసినవారు ఇంటికి తీసుకొచ్చారు. గతంలో కూడా ఇలానే రెండురోజులు ఎటో వెళ్ళిపోతే కష్టం మీద పట్టుకోగలిగామని వారి అబ్బాయి మనోహర్ తెలియజేసారు.”

వార్త చూసి మనస్సు చివుక్కుమంది. ఎంత లైవ్‌లీ పర్సన్!? ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండేవాడు. చిన్నప్పటినుండీ స్నేహితులం మేం. సంవత్సరం క్రితం వాడి అర్ధాంగి కనుమూసిన పిమ్మట మాత్రం వాడిలో జోష్ పూర్తిగా తగ్గిపోయింది. బయటపడే వాడు కాదుకానీ దిగులూ, ఒంటరితనం ఛాయలు మాత్రం బాగా గమనించగలిగేవారికి అవగతమయ్యేవి. భార్యలేని లోటుని కొడుకూ, కోడలూ, మనమళ్ళూ భర్తీ చెయ్యలేరుగదా!

అయితే నాతో స్నేహంలో పెద్ద మార్పేమీ లేదు. నేను రోజులో ఏదో పూట వాడింటికి వెళ్ళడంగానీ, వాడు మా యింటికి రావడంగానీ జరగాల్సిందే. మూడునెలల క్రితం నేను అమెరికా వెళ్ళినపుడు మనిషి బాగానే ఉన్నాడు.

ఇప్పుడు నేనొచ్చినట్టు కూడా గుర్తుపట్టలేడేమో బహుశా. అంతకన్నా ముఖ్యమైన విషయం. వాడు నాకు లక్షరూపాయలు బాకీ. ఆ డబ్బు ఇప్పుడు నాకెంతో అవసరం. ఎంత వద్దన్నా ఆర్థిక అవసరాలు గుర్తురాకుండా మానవుకదా! పైగా పెన్షన్ మీద బ్రతుకుతున్న ఒంటరివాడిని. ఇప్పుడెలా? డబ్బుల సంగతి ఎలాగూ పిల్లలకు చెప్పి ఉండడు. వాళ్ళబ్బాయి మనోహర్‌తో ఈ విషయం ఎలా ప్రస్తావించడం?

అలా అని చెప్పకపోతే ఒడ్డెక్కలేను. మనసు పరిపరివిధాలా పోతోంది. కాసేపయ్యాక నామీద నాకే అసహ్యమేసింది. ఇలా ఆలోచిస్తున్నానేమిటి? మొదట పేపర్లో వాడి ఫోటో చూడగానే కీడు శంకించాను. అది కాదని తెలిశాక హమ్మయ్య అనుకున్నాను. వాడు

వ్యాధిగ్రస్తుడయ్యాడని అయ్యో పాపం అనుకున్నాను. ఇంతలోనే మళ్ళీ నా అప్పుగురించి ఆలోచిస్తున్నాను. ఇదేనా స్నేహితుడిగా నా ధర్మం.!?

ఆలోచనలకు ఫుల్‌స్టాఫ్ పెట్టి వాళ్ళింటికి బయలుదేరాను.

"రండి అంకుల్. అమెరికానుండి ఎప్పుడొచ్చారు?"

"వారమైంది మనోహర్. ఇల్లు సర్దుకోవడంలోనే టైమ్ గడిచిపోయింది. ఇంకో రెండురోజులాగి మీ యింటికి వద్దామనుకున్నాను. ఈలోగా పేపర్లో వార్త చూసి వచ్చేశాను."

మనోహర్ భార్య మంచి నీళ్ళందించి మాటలు కలిపింది.

"నెల్రక్రితం వరకు అంతా బాగుంది అంకుల్. ఒకరోజు లేవడం లేట్‌గా లేచారు. ఆ తర్వాత అలా డల్‌గా మౌనంగా ఉండడం మొదలైంది. డాక్టర్లకి చూపిస్తే అల్జీమర్స్ వచ్చింది. మతిమరుపు మరి తగ్గే ప్రసక్తి లేదు" అని చెప్పారు.

"అదేంటమ్మా. మతిమరుపు వ్యాధి అయితే ర్రానానూ తీవ్రమౌతుంది కదా అలా ఒక్క ఉదుటున వచ్చేస్తుందా? నేను వెళ్ళేముందు వరకూ బాగానే ఉన్నాడు. చక్కగా నాకోసం ఏం తెస్తావోయ్ అమెరికా నుండి అంటూ నన్ను సాగనంపాడు."

"మన ఖర్మ అంకుల్. కొంతమందికి అలా అవుతుందట. ఉండండి కాఫీ తెస్తాను."

ఈలోగా మనోహర్ అందుకుంటూ చెప్పాడు "నేను ఆఫీసుకి బయల్దేరతానంకుల్. నాన్నగారు నిద్రపోతున్నారు. లేచాక మాట్లాడి లంచ్ చేసి వెళ్ళండి"

సరేనంటూ పేపర్లో తల దూర్చాను.

నేనెప్పుడు వచ్చినా మూర్తి ఫ్రెష్‌గా ఉండి నన్నాహ్వానించేవాడు. మధ్య మధ్యలో కొడుకూ, కోడలూ, పిల్లలూ నన్ను విష్ చేస్తుండేవారు. మాటల్లో పడినా, కేరమ్స్ ఆటలో పడినా మాకు టైం తెలిసేదికాదు. లంచ్‌కో, డిన్నర్‌కో పిలిచినప్పుడు లేవటమే. ఇలా వాడిని నిద్రపోతూ చూడడమే అరుదు. ఎలాటి మనిషి ఎలా అయిపోయాడు.!!

"మామయ్యా! ఎవరొచ్చారో చూడండి" మనోహర్ భార్య మూర్తిని తీసుకుని వస్తూ చెప్పింది.

అభావంగా నావైపు చూస్తూ "నమస్కారం. ఎవరు బాబు మీరు?" మూర్తి అడిగాడు.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నేను మూర్తీ, నీ ఫ్రెండ్ జగన్నాధాన్ని. చిన్నప్పటినుండీ కలిసిపెరిగాం మర్చిపోయావా?"

మూర్తి మొహంలో మెరుపు కనపడింది.

"ఒరి జగన్నాధం నువ్వటా. ఈ రోజు కాలేజీకి వెళ్ళలేదా? సునంద ఎలా ఉంది?" మూర్తి వాక్ప్రవాహం మొదలైంది. నా అయోమయం పీక్స్‌లో ఉంది.

నా పరిస్థితి అర్ధం చేసుకున్నట్టు మనోహర్ భార్య చెప్పింది "అల్జీమర్స్‌లో కొన్ని రిమోట్ జ్ఞాపకాలు గుర్తుంటాయట అంకుల్. ప్రస్తుతం మామయ్య కాలేజ్ డేస్‌కి వెళ్ళినట్టున్నారు. ఇంతకీ సునంద ఎవరంకుల్?"

ఈ అమ్మాయి క్యూరియాసిటీ తగలెయ్య అనుకుంటూ "వాడి క్రష్ లేమ్మా. మా కాలేజీలో ఉండేది. ఆ వంకన నాతో కాలేజీకి వస్తుండేవాడు."

"సరిపోయిందంకుల్. అత్తగారున్నప్పుడు ఈ సంగతి మాట్లాడాల్సింది."

వాతావరణం తేలికైంది. ఆ అమ్మాయి, పిల్లలూ అలవాటు పడినట్టున్నారు. మూర్తిని సంరక్షణగా చూసుకుంటున్నట్టు అనిపించింది.

"ఈ వెధవకి సునంద గుర్తొచ్చినట్టు నాకివ్వాల్సిన బాకీ గుర్తొస్తే బాగుణ్ణు" అనుకున్నాను.

వాడితో కాసేపు క్యారమ్స్ ఆడాను. తేరిపారా చూస్తే వాడి మొహం ఎంతో ప్రశాంతంగా ఉంది. ఏ బాదరా, బందీలేని చిన్నపిల్లవాడిలా అనిపించింది. భార్యా విహీనుడయినప్పటినుండీ మొహంలో తాండవించిన దిగులులాంటివి చేత్తో తీసేసినట్టు మాయమయ్యాయి.

ఎప్పుడూ అంటూండేవాడు అంతా మన మంచికే అంటూ. ఓ రకంగా చూస్తే ఇదీ మంచిదేనేమో? లేకపోతే తుదకంటూ దిగులు బరువు మోసేవాడు.

మనోహర్ ఆఫీసునుండి రాగనే, నేను మళ్ళీ రేపొస్తానంటూ బయల్దేరాను.

"ఒక్క నిమిషం అంకుల్" అంటూ బ్యాగ్‌లోంచి డబ్బున్న కవర్ తీసి నాకందించాడు.

నా ఆశ్చర్యంలో నేనుండగానే చెప్పాడు. "నాన్నగారు ఎవరిదగ్గర అప్పు తీసుకున్నా అంతమేరకు ఒక పోస్ట్ డేటెడ్ చెక్ వ్రాసి ఉంచేస్తారు. అది ఆయన అలవాటు. అయితే సంతకం చెయ్యరు. బాకీ తీర్చేయగానే చింపేస్తారు. ఆయన చెక్‌బుక్ చూస్తే మీ పేరుతో లక్షరూపాయలకు వ్రాసి ఉంది మీకేమైనా అవసరం పడొచ్చని డ్రా చేసి తెచ్చాను."

మూర్తివైపు తిరిగి బై చెప్పాను.

"ఏం. కాలేజికేనా?" అంటూ అడిగాడు.

"కాదు. ఇంటికి రేపు కాలేజికి కలిసి వెళ్దాం. సునంద కూడా వస్తానంది" కన్నుకొట్టి చెప్పాను.

మనోహర్ బుర్రగోక్కున్నాడు.

మనోహర్ భార్య నవ్వుకుంది.

Click here to share your comments on this story